
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 17 ఆగస్టు 2025

**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట | : 99854 38368 |
| చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు | : 99854 10940 |
| పలమనేరు, కుప్పం, పుంగనూరు | : 97036 18724 |
| మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి | : 99854 22298 |
| శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు | : 99890 59755 |




# హ్యాపీ ఫ్రీ బస్!

ఎన్నికలొస్తే ఎన్నో చెబుతారు. గెలిచాక అందరూ ఓడమల్లన్నలే! నాయకుల నాలుకలకు నరం ఉండదు. అయినా వాళ్లు మాత్రం అన్నేసి వేల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారు. డబ్బులేమన్నా అచ్చేస్తారా?

.. ఇవి జనంలో ఉండే అభిప్రాయాలు.

అదిగదిగో.. మేం చెప్పలేదా.. చంద్రబాబువన్నీ అబద్ధాలే. సూపర్ సిక్స్ ఒక మోసం.

.. ఇవి జగన్ తరచూ గొంతు చించుకుని అరిచే మాటలు.

**మరి నిజం ఏమిటి?**

ఒక్కొక్కటిగా చెప్పిన మాటలన్నీ నిజం అవుతున్నాయి. చంద్రబాబు హామీలన్నీ పట్టాలెక్కుతున్నాయి. తల్లికి వందనం అంటూ ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుతున్నాయి. రైతన్నలకు ఆర్థికసాయంతో తొలివిడత జమ అయ్యింది. తాజాగా శుక్రవారం సాయంత్రం నుంచి ఆడవాళ్లకు ఫ్రీబస్ మొదలైంది. ఈ ఉచిత ప్రయాణం ఒక సంచలనం. పట్టణాలపై బతుకు ఆధారపడిన గ్రామీణ శ్రామిక స్త్రీలకు ఒక వరం. వారి ఆనందం వర్ణనాతీతం.. అందుకు సాక్ష్యమే జిల్లా నలుమూలల నుంచీ ఆంధ్రజ్యోతి ప్రతినిధులు సేకరించిన ఈ మాటలు..

ఆంధ్రజ్యోతి - తిరుపతి జిల్లా నెట్‌వర్క్

మహిళల్లో పొంగిపొర్లుతున్న సంతోషం

శ్రామిక స్త్రీలలో పెద్ద భారం దిగిన ఆనందం

### మా కష్టం మిగులుతుంది



మేముండేది వెంకటగిరిలో. బాలాయపల్లిలో మెస్సు నడపతాము. రోజూ వెంకటగిరి నుంచీ పొద్దున్నే నేను, మా ఇంటాయన, కూతురు ముగ్గరం బాలాయపల్లి పోతాం. అక్కడ మెస్సు పని చూసుకుని రాత్రికి తిరిగి ముగ్గరం వెంకటగిరికి వచ్చేస్తాం. పోనూరానూ ఒక్కొక్కరికి బస్సు ఛార్జీ రూ.60 అవుతుంది. నెలకు రూ.1800 లెక్కన ముగ్గరికీ రూ. 5400 అవుతుంది. ఇపుడు ప్రభుత్వం ఆడోళ్లకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీగా తిరగనిస్తా వుంది కాబట్టి నాకూ, నా కూతురికీ ఇద్దరికీ కలిపి నెలకు రూ.3600 మిగులుతుంది. కష్టపడి పనిచేసుకుని బతికే మాలాంటి వాళ్లకు ఇది చాలా మేలు చేసినట్టే.

-షేక్ మస్తానమ్మ, వెంకటగిరి

### కూరగాయలకన్నా వస్తుంది!

శని, ఆదివారాలు రెండ్రోజులు లీవులు. అందుకని పిల్లలను పిలుచుకుని సూళ్లూరుపేటలో వుండే మా అక్క ఇంటికి పోతున్నా. మాలాంటి పేదోళ్లకు 50 రూపాయలు మిగిలినా మిగిలినట్టే. దాంతో కూరగాయలు కొనుక్కుంటాం. చంద్రబాబుకు చేతులెత్తి మొక్కాలి.

- చెంగాలమ్మ, వాకాడు









### నమ్మబుద్ధి కావడం లేదు!

బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణమంటే నమ్మబుద్ధి కావడం లేదు. సీఎం చంద్రబాబు సార్ ఆడోళ్లకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ చేయడం మాలాంటి పేదోళ్లకు చానా సాయం చేసినట్టు. ఇపుడు మేము టౌనుకు వచ్చి హాయిగా పనులన్నీ చూసుకుని ఇండ్లకు పోగలుగుతాము.

- లచ్చమ్మ, ఎల్లసిరి గ్రామం, నాయుడు పేట మండలం



### ఆత్మవిశ్వాసం పెంచింది!

ఇది మహిళలకు నిజంగానే ప్రభుత్వం ఇచ్చిన వరం. ఈ సదుపాయం వల్ల మేము ఎప్పుడైనా ఎక్కడికైనా వెళ్లి మా పనులు చేసుకుని రాగల అవకాశాన్నిచ్చింది. ఆడవాళ్లలో ఆత్మ విశ్వాసం పెంచింది.

- జమున, కొత్తపాలెం, చిట్టమూరు మండలం

### పేటకు పొయ్యొచ్చే ఖర్చు మిగిలినట్టే!

మా ఊళ్లో చిన్న బంకు పెట్టుకుని నడుపుకుంటున్నా. రెండు మూడు రోజులకు ఒకసారి సూళ్లూరుపేటకు పోయి సరుకులు తెచ్చుకుంటా. పేటకు పోయినప్పుడల్లా రానూపోనూ బస్సు ఛార్జీలకు 60 రూపాయలు అవుతుంది. ఆ డబ్బులు మిగిలినట్టే.

- వెంకటమ్మ, కోటపోలూరు, సూళ్లూరు పేట మండలం





### చెయ్యి తడుముకునే పని లేదు

పనిమీద ఏడకన్నా బయల్దేరాలంటే బస్సు ఛార్జీలకు డబ్బు వుందా లేదా అని చూసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడా అవసరం లేదు. చేతిలో రూపాయి లేకపోయినా బస్సు ఎక్కేసి పని చూసుకుని వచ్చేయచ్చు.

- రాజేశ్వరి, గొల్లపాలెం, వాకాడు మండలం

### ఎలక్షన్లలో చెబితే ఏమో అనుకున్నాం!

సముద్ర తీరప్రాంతంలో వుండే మాకు టౌనుకు రావాలంటే ఎంతో ఖర్చు అవుతుంది. ఆ ఖర్చుకు భయపడి ఒంటిగా వచ్చి పొయ్యే వాళ్లం. ఇపుడు చంద్రబాబు పుణ్యమాని ఇంట్లో అందరం కలసి వస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఇలా ఫ్రీగా తిరుగుతున్నామని తలచుకుంటా వుంటే ఆశ్చర్యంగా వుంది.

- అనూష, లీషాది, సుబ్బమ్మ... ఖురదగాలి కొత్తపాలెం, చిట్టమూరు మండలం



# నెల్లూరులో గూడూరు కలుస్తుంది!




8

రాజకీయ ఉద్దండుల పురిటి గడ్డ గూడూరు నియోజకవర్గం. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలు సృష్టించిన నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డిల బలమైన ముద్ర కలిగిన గూడూరు నియోజకవర్గంలో అణగారిన వర్గాలనుంచి ఎమ్మెల్యేగా గెలిచి నిలదొక్కుకోవడం సామాన్యమైన విషయం కాదు. గూడూరు నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన పాశం సునీల్ ఇటు రాజకీయాలనూ, అటు పాలనాంశాలనూ బ్యాలెన్స్ చేసుకుంటూ ప్రయాణిస్తున్నారు. 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఎదురైన సవాళ్లను అవకాశాలుగా మలుచుకొని రాజకీయ వైకుంఠపాళిలో ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కుతూ వస్తున్నారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన పాశం సునీల్ తొలి ఏడాదిలో నియోజకవర్గంలో ఏం చేశారు? ఎన్నికలకు ముందు ఏం చెప్పారు? వాటి స్థితిగతులేమిటో ఆంధ్రజ్యోతితో సంభాషణలో వివరించారు.

## తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ సారె

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ తరపున చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం సారె సమర్పించారు. తిరుత్తణి ఆలయ చైర్మన్ శ్రీధర్, తమిళనాడు దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ రమణి టీటీడీ చైర్మన్‌కు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు చైర్మన్‌కు ఆశీర్వచనం అందించి, పట్టువస్త్రాలతో సత్కరించారు.



టీటీడీ తరపున సారె తీసుకెళుతున్న చైర్మన్ బీఆర్ నాయుడు





భక్తులతో కిటకిటలాడుతున్న ఆనందగిరి ఆలయం - పుష్పపల్లకి సేవలో సుబ్రమణ్యస్వామి

# హరోం..హర

- వైభవంగా ఆడికృత్తిక వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆనందగిరి



పుష్పకావిళ్లతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాకాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తికను పురస్కరించుకుని జిల్లాలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు శనివారం హరోం హర నామస్మరణతో మార్మోగాయి. పాకాల మండలం ఊట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీదేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉభయదారులు కోరా రామాంజులు నాయుడు, కోరా సుబ్రమణ్యం నాయుడు కుటుంబ సభ్యులు పాల కావిడి సమర్పించి, పాలాభిషేకం నిర్వహించారు. ఉభయదారుడు సుబ్రమణ్యంరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చలపతిరాజు, గౌరీశంకరరాజు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులు అముదపాకల ఆదికేశవులు నాయుడు, అముదపాకల శ్రీహరినాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రాత్రిఊంజల్‌సేవ నిర్వహించారు. ఉభయదారులు లావణ్యాస్ పిక్చర్స్ ఫ్రేమ్స్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన పల్లకిపై స్వామివారిని రాత్రి పురవీధులలో ఊరేగించారు.ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారి దర్శనానికి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుష్పకావిళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రముఖులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఇందులో తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆలయం వద్ద సౌకర్యాలను పర్యవేక్షించారు. టీడీపీ మండల నేతలు అన్నదానం చేశారు. ఉచిత ప్రసాదాలు,తాగునీరు, మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. గల్లా రాజశేఖర్ నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు,ఈవో యువరాణి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




సమావేశ వేదికపై జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాధరి

# మాకు మర్యాద కావాలి

- జడ్పీ సమావేశంలో సభ్యుల డిమాండ్
- రోడ్ల పనులు పూర్తి చేయలేదని ఆగ్రహం

చిత్తూరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):మండలాల్లో అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని జడ్పీ సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ స్వాతంత్ర్య దిన వేడుకలకు కూడా అధికారుల నుంచి ఆహ్వానం లేదని, పంచాయతీల్లో సర్పంచ్‌ను ఏ ప్రభుత్వ కార్యక్రమాలకూ పిలవడం లేదని జేసీ, జడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవోలు ప్రోటోకాల్ పాటించడం లేదని, జడ్పీటీసీ, ఎంపీపీలకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు.సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రోటోకాల్ పాటించని అధికారులపై ప్రివిలేజ్ కమిటీకి, స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీకి సంబంధించి వ్యవసాయశాఖ ఏడీ ఒకే రైతుకు సంబంధించిన చెక్కును తనతో పాటు ఇతరుల ద్వారా కూడా పంపిణీ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం-టీపీ కోట రోడ్డు ఆర్టీసీ బస్సులు కూడా వెళ్లలేనంత అధ్వాన పరిస్థితిలో ఉందన్నారు. ఈ మార్గంలోనే 3 ప్రభుత్వ పాఠశాలలున్నాయని, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేవీబీపురం మండలంలోని ఎగవపూడి , నారాయణవనం మండలంలోని తంబూరు, పాలమంగళం వంతెనలు భారీ వర్షాలు పడినప్పుడల్లా కొట్టుకుపోతున్నాయన్నారు.తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టేస్తున్నారని, ఇకనైనా వంతెనల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించాలన్నారు.నాగలాపురం నుంచి సురుటుపల్లె వెళ్లే మార్గంలో 3 కిలోమీటర్లు రోడ్డు వేయాల్సి వున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రైవేటు, నెట్‌వర్క్ ఆస్పత్రులకు కూడా 108, 102 సర్వీసుల సౌకర్యం కల్పించాలని సూచించారు.పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నీటి సమస్య లేకుండా బోర్లన్నిటికి విద్యుత్ సౌకర్యం వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. కుప్పం జడ్పీటీసీ శరవణన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చిత్తూరు చర్చి వీధిలో ఉన్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని నగరానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని సంతపేటకు మార్చడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. నారాయణవనంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా పనిచేయకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారని జడ్పీటీసీ సుమన్ ఆరోపించారు.శ్రీకాళహస్తి-పల్లం నడుమ సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.మదనపల్లె జడ్పీటీసీ ఉదయ కుమార్ మాట్లాడుతూ తమ మండలంలో మూడేళ్ల క్రితం సుమారు 75 లింక్ రోడ్లు మంజూరైతే ఒక్క రోడ్డు పని కూడా పూర్తికాలేదన్నారు. రామసముద్రం మండలంలో 28 రోడ్లకు గ్రావెల్ వేసి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని జడ్పీటీసీ రామచంద్రా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.శ్రీకాళహస్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సెక్యూరిటీ దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డీఈవో వరలక్ష్మిని జడ్పీటీసీ వెంకట సుబ్బారెడ్డి కోరారు. రామకుప్పం మండలం ఆర్.నడింపల్లెలో స్కూల్ నిర్మాణానికి తాను భూమి కొని ఇచ్చానని జడ్పీటీసీ నితిన్ రాఘవ రెడ్డి తెలిపారు. అయితే ఇప్పుడు ఆ పాఠశాలను వేరే పాఠశాలతో కలిపేశారని, దీంతో ఆ గ్రామంలో ఉన్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని,ఇప్పుడు తాను కొనిచ్చిన భూమిని ఏం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు వెళ్లి వైద్యం అందించాల్సిన ఆశా కార్యకర్తలు ఆ పని చేయడం లేదని, వైద్యం అందించాలని చెప్పిన ఏఎన్ఎంపై దాడికి పాల్పడుతున్నారని పాకాల జడ్పీటీసీ పద్మజా రెడ్డి ఫిర్యాదు చేశారు.దీంతో గర్భిణులు, వృద్ధులు వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారన్నారు.పెద్దమండ్యంలో ట్యాంకుల ద్వారా నీళ్ల సరఫరా చేసిన బిల్లులు రెండేళ్లయినా మంజూరు కాకపోవడంతో, ట్యాంకర్ల యజమానులు తన ఇంటి వద్దకు వస్తున్నారని జడ్పీటీసీ పీరమ్మ ఆందోళన వ్యక్తం చేశారు.వ్యవసాయ సర్వీసులకు రెండు సంవత్సరాల క్రితం డబ్బులు కట్టినా ఇప్పటికీ కనెక్షన్లు ఇవ్వలేదనిఆమె ఆరోపించారు.తమ మండలంలోనే సుమారు 500 వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని విద్యుత్ శాఖ దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తొలుత అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో సమావేశాన్ని ప్రారంభించారు. సభలో చర్చించిన విషయాలను జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాధరి మీడియా సమావేశం నిర్వహించి వివరించారు.సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



హాజరైన ఎమ్మెల్యేలు, సభ్యులు



## కనులపండువగా కన్నయ్య వేడుక

- ఇస్కాన్‌లో పోటెత్తిన భక్తులు

8

## బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న కటాక్షం



చంద్రగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం కన్నులపండువగా ఊంజల్ సేవ జరిగింది.. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి,బంగారు తిరుచ్చి వాహనంపై ఆలయమాడ వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



రామచంద్రాపురం,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రామాపురం గోవర్ధనగిరిపై వెలసిన చిన్మయ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో వేణుగోపాలస్వామికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాల నడుమ ఊంజల్‌సేవ జరిగింది. రాత్రి గరుడ వాహనంపై ఉత్సవమూర్తులను ఊరేగించారు. అనంతరం ధ్వజావరోహణంతో కార్యక్రమాలు బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో చిన్మయమిషన్ ముఖ్యసేవక్ ఫణీంద్ర సాయి, చీఫ్ ప్యాటరన్ మబ్బు సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అనుపల్లె రోడ్డులో అడుగడుగునా గోతులే



సూరావారిపల్లె వద్ద ఏర్పడ్డ గుంతలు

రామచంద్రాపురం,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు నుంచి అనుపల్లె వరకు పెద్దగుంతలు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఐదేళ్ల జగన్‌పాలనలోఈ రోడ్డుపై తట్ట మట్టికూడా పోయలేదు. ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారంలోకి వచ్చాక తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అవి కొన్నాళ్లకే మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుత వర్షాలకు రాయలచెరువు కట్ట నుంచి అనుపల్లె వరకు 12కిలోమీటర్ల దూరం అడుగుగడుగునా గుంతలు ఏర్పాడ్డాయి. రాయలచెరువు కట్ట నుంచి సూరావారిపల్లె, గొల్లపల్లి, తిమ్మరాజుపల్లె, నెత్తకుప్పం, బీరమాకులకండ్రిగతో 30 గ్రామాలకు పైగా ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. గుంతల్లో నీరు నిలిచి ఎంతలోతుందో తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులుచేపట్టాలన్నారు.

## శ్రీకృష్ణ మందిరానికి బీరువా వితరణ



పాకాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలోని స్థానిక శ్రీకృష్ణ మందిరానికి పాకాల పాటినం లయన్స్ క్లబ్ సభ్యుడు టి.జయరామనాయుడు బీరువాను విరాళంగా అందజేశారు. శనివారం కృష్ణాష్టమి పురస్కరించుకొని మందిరం దీనిని అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెఎన్ తులసీరామన్, కార్యదర్శి దామోదర నాయుడు, ట్రెజరర్ కుప్పుస్వామినాయుడు, జి.రామయ్య, ఆర్వీ ప్రసాద్, డి.మునస్వామి, ఆర్ దొరస్వామినాయుడు, అబ్దుల్ షబ్బీర్, ఆలయ నిర్వాహకుడు టి.సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి మండపాలకు అనుమతి తప్పనిసరి

భాకరాపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వినాయక మండపాలకు పోలీసుల నుంచి తప్పనిసరగిగా అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశాల గురించి పోలీసులకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారన్నారు. మైకులు, మ్యూజిక్ సిస్టంలు రాత్రి 10 గంటల వరకే ఉపయోగించాలన్నారు. ఊరేగింపులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. సహజసిద్ధంగా తయారు చేసినవి గణేశ్ ప్రతిమలనే ఉపయోగించాలన్నారు.

## వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



ఎడంవారిపల్లెలో కృష్ణ ఆలయం వద్ద ఉట్టి కొట్టే సంబరం

రామచంద్రాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వర ఉపాలయంలోని లక్ష్మీనారాయణస్వామికి శనివారం తిరుమంజనం నిర్వహించారు. రాయలచెరువుపేట రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని విశేషంగా అలంకరించారు. నడవలూరు గోపాలకృష్ణమందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో ఉభయదాతలు అబ్బూరి దేవరాజులునాయుడు, తంజావూరు మురళికృష్ణ దంపతులు పాల్గొన్నారు.

**భాకరాపేట:** ఎడంవారిపల్లెలో కృష్ణ ఆలయంలో శ్రీ కృష్ణునికి పూజలు చేసి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామి భజన చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పాడి రైతులకు సమీకృత దాణా పంపిణీ



చంద్రగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పాడి పశువులలో ఎద క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నారావారిపల్లె పశు వైద్యాధికారి వంశీ కోరారు. శనివారం నారావారిపల్లె క్లస్టర్‌లో 130 మంది పాడి రైతులకు 4.5 టన్నుల సమీకృత దాణా పంపిణీ చేశారు. ఈపథకంలో రైతు తనవాటా కింద రూ.400 చెల్లిస్తే ప్రభుత్వం 50 శాతం రాయితీతో రూ.100 విలువ గల దాణా అందిస్తుంది. పశువులు చూలు కట్టడానికి, పాల ఉత్పత్తి పెరగడానికి ఈ దాణా దోహదపడుతుందన్నారు. పాడి రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 22నుంచి బ్యూటీషియన్ కోర్సు శిక్షణ

చంద్రగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 22 నుంచిమహిళలకు జూనియర్ బ్యూటీ ప్రాక్టీస్ పేరిట ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెల్ల రేషన్ కార్డు కలిగిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. 19-40 సంవత్సరాల మధ్య వయసుండి కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత భోజనం సౌకర్యం కల్పిస్తామన్నారు. రానుపోకూ ఒకసారి చార్జీలు ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు .7989680587, 9494951289, 6301717672 నంబర్లలో సంప్రదించాలన్నారు.

# చంద్రగిరి

## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



జస్టిస్ జోతిరామన్-జస్టిస్ సునిత్ అగర్వాల్

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వారిలో.. గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సునిత్ అగర్వాల్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిరామన్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు ఉన్నారు.

## చెన్నైలో శ్రీవారిని దర్శించుకున్న టీటీడీ చైర్మన్

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): చెన్నై టీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం పూజలు నిర్వహించి ఆశీర్వచనం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ.. టీ నగర్ గర్భాలయ విమాన గోపురం నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులను ప్రణాళికలు సిద్ధం చేయమని ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కుమరగురు, మాజీ ఎస్‌ఏసీ చైర్మన్లు శేఖర్ రెడ్డి, నూతలపాటి కృష్ణ, మాజీ సభ్యులు చంద్రశేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల రద్దీకి అనుగుణంగా బందోబస్తు :ఎస్పీ

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమల భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుమల పోలీసు అధికారులను ఆదేశించారు. తిరుమల రింగురోడ్డులోని సర్వదర్శన క్యూలైన్లను, మాడవీధులను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆయన స్థానిక పోలీసులతో ,భక్తులు, శ్రీవారిసేవకులతో మాట్లాడారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే దగ్గర్లోని పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదనపు ఎస్పీ రామకృష్ణ, సీఐ విజయ్‌శేఖర్, సీఐలు విజయ్‌కుమార్, శ్రీరాముడు, హరిప్రసాద్, ఎస్‌ఐలు ఉన్నారు.

## వేడుకగా ఆడికృత్తిక మహోత్సవం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దివాకర్‌రెడ్డి దంపతులు

తిరుపతిరూరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తనపల్లె పద్మగిరికొండపై వెలసిన బాలజ్ఞాన దండాయుధపాణి ఆలయంలో శనివారం ఆడికృత్తిక మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తుల కావిళ్లతో తరలివచ్చారు. ఆలయం కిటకిటలాడింది. క్యూలైన్లని ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కావిడి మొక్కు చెల్లించారు. తీర్థప్రసాదాలు, అల్పాహారం, మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి దంపతులు, మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దివాకర్‌రెడ్డి దంపతులు అన్నదాన సేవ నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, నేతలు అమిలినేని మధు, కత్తిసుధాకర్, నిర్వాహకులు విజయసింహారెడ్డి, బాలచంద్రారెడ్డి, హేమంత్‌రెడ్డి, అర్చకులు షణ్ముఖస్వామి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి

తిరుపతిరూరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): చిగురువాడ పంచాయతీ కొత్తూరులో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణాలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లని మేల్కొలిపి అభిషేకం, కుంకమార్చన, కళ్యాణోత్సవం, ఉట్లోత్సవం సేవలని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. ధర్మకర్త వార్తాల శివాయాదవ్, మాజీ ఎంపీటీసీ వార్తాల శ్రీనివాసులుయాదవ్, వెంకట్రామయ్య యాదవ్ పాల్గొన్నారు.

## మఠం భవనం కూల్చివేత టెండర్‌ను రద్దుచేయాలి



రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధుల ఆందోళన

తిరుపతి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భవనం కూల్చేందుకు పిలిచిన టెండర్‌ను రద్దుచేయాలని తిరుపతి స్థానిక రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ డీఎంసీ భాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మఠం భవనానికి ఎలాంటి ప్రమాదం లేకపోయినా కమీషన్ కోసం మఠం అధికారులు మఠం భవనాన్ని కూల్చడానికి టెండర్ ఇచ్చారని ఆరోపించారు. మఠం భవనాన్ని కూల్చడం వలన 500 మంది స్థానికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు.

## లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి

తడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి చెందిన ఘటన తడ మండలంలోని పన్నంగాడు వద్ద జరిగింది. తమిళనాడు విల్లుపురం ప్రాంతానికి చెందిన ఆర్ముగం(48) కొంతకాలంగా తడ మండలంలోని ఎలాఊరులో వ్యాపారం చేస్తున్నాడు. శనివారం వచ్చి తిరిగి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా ఓ లారీఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడినిఎలాఊరు చెక్‌పోస్టు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు.

# శ్రీవారిమెట్టు వద్ద భక్తుల ఇబ్బందులు




చంద్రగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. మన రాష్ట్రంలో పాటు తమిళనాడు, కర్నాటకలకు చెందిన వేలాది భక్తులు కాలినడకన తిరుమలకు వెళ్తేవారు. ఇక్కడే టీటీడీ టైమ్ స్లాట్ టోకెన్లు ఇచ్చేది. ఆటోవాలాలా దోపిడీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ తిరుపతి అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద ఈ టోకెన్లు జారీ చేస్తున్నారు. చిత్తూరు, మదనపల్లె మార్గాల భక్తులు శ్రీనివాసమంగాపురం దాటుకుని అలిపిరికి వెళ్ళాల్సిన వస్తోంది అక్కడ టోకెన్లు తీసుకుని మొక్కు ఉన్న భక్తులు మళ్లీ వెనుకకు శ్రీవారి మెట్టు మార్గానికి వస్తున్నారు. సుమారు 30 కిలోమీటర్ల దూరం అధికంగా ప్రయాణించాల్సి వస్తోంది. అంతేకాదు అదనంగా సమయం వృథా అవుతోందని భక్తులు వాపోతున్నారు. టీటీడీ ముందస్తు దర్శనం టోకెన్లు కూడా ఇస్తోంది. అదే రోజు వస్తేనే శ్రీవారిమెట్టు మార్గంలో అనుమతిస్తున్నారు. ముందు రోజు వచ్చినా అనుమతించడంలేదు. పన్నెండేళ్ల వయసు లోపు పిల్లలను మధ్యాహ్నం 2 గంటలు దాటితే ఈమార్గంలో అనుమతించడంలేదు. శ్రీవారిమెట్టు మార్గంలో టైమ్ స్లాట్ టోకెన్ల జారీని పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు. ముందస్తు టైమ్ భక్తులను కూడా అనుమతించాలంటున్నారు.

### ముందురోజు అనుమతించాలి



శ్రీవారిమెట్టు మార్గంలో వస్తామని మొక్కుకున్నాము. ఆదివారం దర్శనానికి శనివారం టోకెన్లు ఇచ్చారు. కానీ శనివారం అనుమతించడంలేదు. ఆదివారమే రమ్మని టీటీడీ సెక్యూరిటీ చెబుతున్నారు. చెన్నై నుంచి వచ్చిన మేము అప్పటివరకూ ఎక్కడ వేచి ఉండాలి. పైగా సమయం వృథా అవుతోంది. -సంతోష్, చెన్నై

### పిల్లలను అనుమతించడంలేదు



శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన వస్తామని మొక్కుకున్నాము. మధ్యాహ్నం 2 గంటల పైన పిల్లలు ఉన్నవారిని అనుమతించడంలేదు. శ్రీనివాసమంగాపురంలో కనీస వసతి కూడా లేదు. ఇలా అయితే పిల్లలతో ఎన్ని ఇబ్బందులు పడాలో కదా. -నాగభూషణం, కావలి.

### తిరుపతి వెళ్లి మళ్లీ రావాల్సిందేనా..



గుడియాత్తం నుంచి వచ్చాం. శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు వెళ్ళాలనుకున్నాం. తిరుపతిలో అలిపిరి వద్ద టోకెన్లు ఇస్తున్నారంటే వెళ్లి మళ్లీ వెనక్కి శ్రీవారి మెట్టుకు చేరుకుని అక్కడికి కాలినడకన వెళడం కష్టంగా ఉంది. -వేణుగోపాల్, గుడియాత్తం.

## శేషుడిపై దేవకీసుతుడి అభయం



గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు



తిరుచానూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆలయంలో శనివారం గోకులాష్టమి సందర్భంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. ఫ్రైడే గార్డెన్ గోశాలలో అర్చకులు, అధికారులు గోపూజ నిర్వహించారు. అమ్మవారి నైవేద్యాన్ని గోవులకు తినిపించారు. మధ్యాహ్నం కేటీమండపంలో ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సర్వాలంకార శోభితులైన శ్రీకృష్ణుడు పెద్దశేషవాహనంపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. భక్తులు నారికేళ, కర్పూర హారతులు సమర్పించారు. ఆదివారం సాయంత్రం ఆలయం వద్దఉట్లోత్సవం జరుగుతుంది. డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

## ఆనందగిరిపై ఘనంగా ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



లడ్డూలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీదేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామివారి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలలో శనివారం రాత్రి కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మహిళలు కోలాటాలు, చెక్కభజనలు చేశారు. ఆలయ చరిత్రను కథల రూపంలో తెలియజేశారు. భక్తులందరూ సంతృప్తిగా దర్శించుకునేలా ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి పుష్పపల్లకీ సేవ జరిగింది. స్వామిని దర్శించుకున్నవారిలో నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి మోహిత్‌రెడ్డి ఉన్నారు. స్త్రీశక్తి పథకం ఫలితంగా అధిక సంఖ్యలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో దర్శనానికి వచ్చారు.

## ఆక్రమిత స్థలంలో ప్రహరీ తొలగింపు



తిరుపతి రూరల్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): తనపల్లెపంచాయతీ సర్వేనంబరు 228లోని కాలువస్థలం ఆక్రమణకు అడ్డుకట్ట పడింది. రోడ్డుకు ఆనుకుని ఉన్న విలువైన భూమిలో కొందరు శనివారం ప్రహరీని నిర్మించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయాన్ని గ్రామస్తులు తహసీల్దార్ రామాంజులునాయక్‌కు నివేదించారు. వీఆర్వో పరిశీలించి కాలువభూమిగా నిర్ధారించారు. ప్రహరీని తొలగించాలని సూచించారు. వారు స్పందిచకపోవడంతో ఎక్స్‌వేటర్ సాయంతో ప్రహరీ నిర్మాణాన్ని తొలగించారు. పన్నెండేళ్ల క్రితం ఈభూమి సమీపంలోని ఓ ప్రైవేట్‌వ్యక్తి తనభూమిలోకి వెళ్లేందుకు14సెంట్లలో కల్వర్టు నిర్మాణానికి ఇరిగేషన్ అధికారుల అనుమతి సుకున్నారన్నారు. అయితే నిర్మాణాన్ని చేపట్టలేదు. నాటి ఉత్తర్వులను వెనక్కి తీసుకునేలా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్నామన్నారు.

## మ్యాన్‌హోల్‌ను బాగుచేయండి



మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగునీరు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): స్థానిక యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయం సమీపంలో మ్యాన్ హోల్ నుంచి రోడ్డుపైకి వారం రోజులుగా మురుగునీరు ప్రవహిస్తోంది. ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## అసలే గుంతలు..ఆపై బురదనీరు

● ఆర్టీవో కార్యాలయం ● శెట్టిపల్లి రోడ్డులో ప్రయాణం నరకప్రాయం





కల్వర్టు వద్ద వాహన చోదకుల అవస్థలు- రోడ్డుపై గుంతలు

తిరుపతి అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మంగళంలోని ఆర్టీవో కార్యాలయం నుంచి శెట్టిపల్లె రైల్వేగేటు వరకు ప్రయాణం వాహనదారులకు సవాలుగా మారింది. గతుకులమయంగా ఉన్న ఈ రోడ్డు వర్షానికి బురదమయంగా మారింది. పైగా గుంతల్లో నీరు చేరింది. మార్గంమధ్యలో నిర్మిస్తున్న కల్వర్టుకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు గుంతలను గుర్తించలేక పడి గాయాలపాలయ్యారు. ఈ రోడ్డు నిర్మాణంలో టీటీడీ జాప్యం చేస్తుండటం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి గుంతలను పూడ్చి, బురదలేకుండా కంకరపరచాలని కోరుతున్నారు. బ్రిడ్జి నిర్మిస్తున్న కాంట్రాక్టర్ చొరవచూపి ప్రత్యామ్నాయ రోడ్డును పునర్నిర్మించాలని డిమాండు చేస్తున్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కుమారదేవంకు చెందిన కాసాని శ్రీహరిగౌడ్ దంపతులు శనివారం రూ.1,00,116ను విరాళంగా ఇచ్చారు. ఆలయ అధికారులు చెక్కును స్వీకరించి దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఈ కేంద్రాలను వ్యర్థంగా వదిలేస్తే ఎలా?




సామిరెడ్డిపల్లె పంచాయతీలో సంపద కేంద్రం

పాకాల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలు ఆశించిన మేర ఫలితాలు సాధించడం లేదు. 22 పంచాయతీల గాను 18 పంచాయతీలలో ఈ కేంద్రాలను నిర్మించారు. చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్లను కూడా నియమించారు. పాకాల, దామలచెరువు మేజర్ పంచాయతీలలోని కేంద్రాల్లో కొంతమేర కార్యకలాపాలు జరుగుతున్నాయి, తడి, పొడి చెత్తలను సేకరిస్తున్నారు. వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు. మిగిలిన పంచాయతీల్లోని ఏమాత్రం కార్యకలాపాలు నిర్వహించడం లేదు. గ్రామాలకు దూరంగా కేంద్రాలను నిర్మించడంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. తొట్టెలు ఖాళీగా ఉంటున్నాయి. గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు వృథా అవుతున్నాయి. గ్రామాల్లో చెత్త సేకరణ ఇబ్బందిగా మారిందని తెలిసింది. రైతులు వ్యర్థాలను దిబ్బల్లో వేసుకొని పొలాలకు వాడుకుంటున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వీటిని వాడుకుంటే లక్షలాది రూపాయలతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలకు సార్థకత ఏర్పడుతుంది. ఈదిశగా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో ఆచరణలో పొంతన కుదరడంలేదు.

# గోసంరక్షణ అందరి బాధ్యత


ఆవుకు పచ్చిగడ్డి తినిపిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : గోసంరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తిరుపతి ఎస్వీ గోసంరక్షణ శాలలో శనివారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీటీడీ ఈవో శ్యామలరావుతో కలిసి ఎమ్మెల్యే ఇక్కడ వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. గోమందిరంలో ఆవు, దూడలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గోవులకు గ్రాసం తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గోసంరక్షణకు ప్రభుత్వ సూచనలతో టీటీడీ మెరుగైన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. టీటీడీ ఈవో మాట్లాడుతూ ప్రస్తుతం గోశాలలో 2,789 గోవులు ఉన్నాయని తెలిపారు. పిండ మార్పిడి ద్వారా మేలురకమైన దేశీయ ఆవుల ఉత్పత్తికి వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంతో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. దేశవాళీ ఆవుల సంరక్షణ కోసం గోశాలలో రూ.46కోట్లతో చేపట్టిన ఎన్‌డీడీబీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అక్టోబరు నెలలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఆవునెయ్యి తయారీ కోసం నిర్మిస్తున్న కేంద్రం త్వరలో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు, దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనలు, కోలాటాలు నిర్వహించారు. సాయంత్రం హిందూ ధర్మప్రచార పరిషత్ కళాకారుల హరికథా పారాయణం వీనులవిందుగా సాగింది. అలాగే కపిలతీర్థం ఆలయంలో వేణుగోపాల స్వామి సన్నిధిలో గోకులాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## అవిలాల ఎకోలాజికల్ పార్కుకు ఏపీజీబీసీ డిజైన్


చంద్రబాబును కలిసిన సుగుణమ్మ

తిరుపతి, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): అవిలాల చెరువులో అభివృద్ధి సుందరీకరణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ సీఎం చంద్రబాబును కోరారు. శుక్రవారం రాత్రి విజయవాడలో ఆయన్ను సుగుణమ్మ కలిశారు. తిరుపతి నియోజకవర్గ పరిస్థితులు, టీడీపీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల కేటాయించాలని కోరారు. నీటి పారుదల శాఖ, టీటీడీ, తుడా సమన్వయంతో చెరువులను బలోపేతం చేయాలని విన్నవించారు. అవిలాల ఎకోలాజికల్ పార్క్ అభివృద్ధి కోసం ఏపీజీబీసీ ద్వారా డిజైన్లు, అంచనాలు సిద్ధంచేసి టీటీడీకి అందజేశామని వివరించారు. సాంకేతిక అనుమతులు మంజూరు చేసి టీటీడీ టెండర్లను ఆహ్వానించిందని గుర్తుచేశారు.

## ట్రాన్స్ జెండర్ ట్రూ స్టోరీ పుస్తకం ఆవిష్కరణ



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ ప్రతినిధులు శనివారం ప్రముఖ రచయిత కత్తిమండ ప్రతాప్ రాసిన ట్రాన్స్ జెండర్ ట్రూ స్టోరీ (అతడు-ఆమె) పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్స్ మాటాడుతూ ఈ పుస్తకంలో తమ ఆవేదనను కళ్లకు కట్టినట్లు రచయిత ప్రతాప్ ఆవిష్కరించారని తెలియజేశారు. హర్షిణి కథ కేవలం ఒకరి జీవితం కాదని ప్రతి ట్రాన్స్‌జెండర్ మనసులోని బాధ, గౌరవం కోసం జరిగే పోరాటమని పేర్కొన్నారు. హేమానవీన్, నందిని, సుప్రియ, కరీష్మా, జెస్సికా, చందు, లిఖిత పాల్గొన్నారు.



## శ్రీకృష్ణుడి కృప అందరిపై ఉండాలి: ఎమ్మెల్యే



తిరుపతి అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుని కృప ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆకాంక్షించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆయన కుటుంబ సమేతంగా శనివారం ఉదయం ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణుని సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు ఆరణి జగన్, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, సుధా, బాబ్జీ, రాజేష్‌ఆచారి, మునస్వామి, పురుషోత్తం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్ ఆలయంతో సమానం: ఎస్పీ


వెంకటగిరి స్టేషన్‌ను శుభ్రం చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్లు ఆలయాలతో సమానమని ఎస్పీ హర్షవర్ధన రాజు పేర్కొన్నారు. పర్యావరణ, పరిశుభ్రతలో భాగంగా ప్రతి మూడవ శనివారం జిల్లాలోని అన్నిస్టేషన్లు శుభ్రం చేసి పర్యావరణాన్ని కాపాడుకునే క్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో నిర్వహించారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పరిసరాలను శుభ్ర పరిచారు.

## రేపటి నుంచి ఆగమ జాతీయ సదస్సు

- కన్వీనర్ ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీ నుంచి సంస్కృత యూనివర్సిటీలో ఆగమాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. వైఖానస పాంచారాత్ర శైవ తంత్రసార ఆగమాలపై చతురాగమ సదస్సు చేపట్టనున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది ప్రతినిధులు పాల్గొంటారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహిస్తారు. సదస్సు కన్వీనర్‌గా వర్సిటీ ఆగమ విభాగ ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు వ్యవహరిస్తారు. ప్రారంభ సభకు అతిథిగా మైలాపూర్ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ అరుణ సుందరం పాల్గొంటారు. ప్రధాన వక్తగా టీటీడీ ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని హాజరు కానున్నారు. బెంగళూరులోని పూర్ణప్రజ్ఞా సంశోధనా సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ వీరనారాయణపాండురట్టీ పాల్గొంటారు. సదస్సులో పాల్గొనే వారు.. 9640950117 తో సంప్రదించవచ్చు.

## మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళులు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని వాజ్‌పేయికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక రాఘవేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భవానీశంకర్, నరేష్, ఖాయం హరి, నాగోతు హరి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, పెనుబాల చంద్రశేఖర్, దస్సగిరి, సుబ్రహ్మణ్యంరెడ్డి, రెడ్డిబాబు పాల్గొన్నారు.

## గౌతు లచ్చన్నకు ఎస్పీ నివాళి



తిరుపతి (నేర విభాగం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ఎస్పీ హర్షవర్ధనరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు, రిజర్వు ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## శాంతియుత రాజ్యస్థాపనే సీపీఐ లక్ష్యం


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): దేశంలో శాంతియుత రాజ్యస్థాపన కోసం సీపీఐ నిరంతరం కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. బైరాగి పట్టెడలోని రామానాయుడు పాఠశాలలో శనివారం సీపీఐ జనసేవ దళ్, కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ కమ్యూనిస్టులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో వేగవంతంగా మార్పులు చోటు చేసుకొం టున్నాయని చెప్పారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తులు అధికారాన్ని కైవసం చేసుకొని, రాజ్యాంగాన్ని కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు చేసే ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జనసేనదళ్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. లౌకికవాదులను ఐక్యం చేసి మతోన్మాదుల ఆగడాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసిహారెడ్డి, జిల్లా క్యాదర్శి పి.మురళి, నాయకులు విశ్వనాథ్, బి.చలపతి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐఎంసీలో 8వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాల (ఆర్ఐఎంసీ) 2026 విద్యా సంవత్సరానికి గాను 8వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు 7వ తేదీన జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష జరగనుందని వెల్లడించారు. 2013 జూలై 2వ తేదీ నుంచి 2015 జనవరి 1వ తేదీ మధ్య జన్మించిన విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తులు తదితర వివరాలకు 9399976999 / 8688888802 సెల్‌ఫోన్ నంబర్లలో లేదా వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్, మిలటరీ పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో సంప్రదించవచ్చని తెలిపారు.

## అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు


ఉత్తమ అవార్డులు అందుకున్న వైద్యులను అభినందిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వృత్తిని దైవంగా భావించి అంకిత భావంతో పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న స్విమ్స్ అనస్థీషియా విభాగాధిపతి అలోక్ సమంత్‌రే, అసిస్టెంట్ డైరెక్టర్లు రాజశేఖర్, సతీష్‌లను శనివారం ఆయన అభినందించారు.

## స్విమ్స్‌కు రూ.లక్ష విరాళం



తిరుపతి(వైద్యం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లోని శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి తిరుపతికి చెందిన వి.రజనీకుమారి, ఎంవీఆర్ ప్రసాద్ దంపతులు లక్ష రూపాయలను విరాళంగా అందించారు. స్విమ్స్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న తన సోదరి ధనలక్ష్మితో కలిసి చెక్కును శనివారం డైరెక్టరు ఆర్వీకుమార్‌కు అందజేశారు. దాతలను ఆయన అభినందించారు.

# వైభవం.. ఆడికృత్తిక మహోత్సవం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో ఆడికృత్తిక మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ చేసి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, విభూది వంటి తదితర సుగంధ ద్రవ్యాలతో సర్వాభిషేకాలు నిర్వహించారు. మూలవిరాట్లకు అభిషేకాలు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం భక్తుల హరోం హర నామ స్మరణతో మార్మోగింది. సాయంత్రం ఉత్సవమూర్తులు తిరువీధుల్లో ఊరేగించారు. అలాగే నగరంలోని పలువురు భక్తులు పూలకావళ్లతో తిరుత్తణికి తరలివెళ్లారు.




శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకాలు -ఉత్సవమూర్తుల పురవిహారం - పూలకావళ్లతో తిరుత్తణికి వెళ్తున్న కొర్లగుంటకు చెందిన భక్తులు

## భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

**తిరుపతి(కల్చరల్):** తిరుపతి పురవీధుల్లో నగర సంకీర్తన మండలి ఆధ్వర్యంలో శనివారం నగర సంకీర్తన వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు గుండాల గోపీనాథ్, వాసుదేవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గంగయ్య, నరసింహారెడ్డి, జేజిరెడ్డి, సురేంద్రరెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి పాల్గొన్నారు.



గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

## సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రైతు బాంధవుడు, విప్లవ నాయకుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని శనివారం ఘన నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెంకటేశ్వర్ పూలమాల వేసి, నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. మొదటిసారిగా ఆయన జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లా గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల చెంగయ్య, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిణి జ్యోత్స్న, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి గురుస్వామిశెట్టి, జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆదివారం తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు(07097) తిరుపతిలో ఆదివారం బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాద్‌గిర్, తాండూరు, వికారాబాదు, లింగంపల్లి, బేగంపేట మీదుగా మరుసటి రోజు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి ఈ రైలు(07098) సికింద్రాబాద్‌లో సోమవారం బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మంగళవారం తిరుపతికి చేరుకుంటుందని వివరించారు. ఇందులో 2ఏసీ, 3ఏసీ, 3ఏసీ ఎకానమి, సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు, సాధారణ కోచ్‌లు ఉంటాయని వెల్లడించార


## సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, ఆక్టోపస్ భవనం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**గురువారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు**

**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,043**

**తలనీలాలు సమర్పించినవారు: 41,859**





కథనం, ఇంటర్వ్యూ : గూడూరు, ఆంధ్రజ్యోతి

ప్రోగ్రెస్ రిపోర్ట్

**ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా కాలేజీ దశలోనే రాజకీయాలతో కలిసి నడిచిన సునీల్ 1995లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. గూడూరు మున్సిపల్ చైర్మన్‌గా ప్రస్థానం మొదలైంది. 2014లో గూడూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తిరిగి 2024లో రెండవ పర్యాయం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నిత్యం ప్రజల్లోనే ఉండే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. పిలిస్తే పలుకుతారు. చేయగలిగిన పనులు చేస్తారు. పార్టీలో అందరితో సఖ్యతగా ఉంటూ అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారు. తొలి ఏడాది గూడూరు ఎమ్మెల్యేగా ఆయన చేసినవీ, చేయాల్సినవీ, ఆయనకు సంతృప్తినిచ్చినవీ.. ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే...**



గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్

### 1 ఏడాదిలో ఏం చేశారు?

**తొలి ఏడాది చేసినవి ఇవీ...**

తొలి ఏడాది కాలంలో గూడూరు నియోజకవర్గంలో రూ. 218 కోట్ల రూపాయల పనులు జరిగాయి.

- రోడ్ల నిర్మాణాలకు పెద్దపీట వేశాం. మొత్తం 700 పనులను 39.14 కోట్ల రూపాయలు ఖర్చు చేశాం.
- ఇరిగేషన్ పనులు పెద్ద ఎత్తున చేపట్టాం. చెరువులు, కాలువల మరమ్మతులు, చెక్‌డ్యాంలు ఇలా ఏడాది కాలంలో రూ.88 కోట్లతో 200 పనులు చేశాం.
- నాబార్డు, ఆర్‌డీఎఫ్ నిధులతో 33 ఆర్ అండ్ బీ రోడ్లు రూ.8కోట్లతో మరమ్మతులు చేశాం.
- నియోజకవర్గంలో లోటల్టేజ్ సమస్యతో రైతాంగం తీవ్రంగా ఇబ్బందిపడేది. తొలి ఏడాది కాలంలోనే రూ.5.77 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశాం.
- వాకాడులో రూ.5.10 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మించాం. రూ.16 లక్షలతో ఏరియా ఆసుపత్రి కాంపౌండ్ వాల్ నిర్మించాం.
- ప్రజా రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు గూడూరు డిపోకు రూ. 16కోట్ల వ్యయంతో 30 కొత్త ఆర్టీసీ బస్సులు తెప్పించాం.
- గూడూరు మున్సిపాలిటీలో పారిశుధ్యం, అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టాం. రూ.69లక్షలతో అన్ని వార్డుల్లో కాలువల పూడిక తీయించాం. మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకున్నాం.
- రూ.70లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశాం. రోడ్లు, డ్రైన్ల మరమ్మతులు, పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుపరచడానికి రూ.4 కోట్లు ఖర్చు చేశాం.



నాడు

వైసీపీ ప్రభుత్వంలో గూడూరు-చెన్నూరు ప్రధాన రోడ్డు



నేడు

కూటమి పాలనలో అదే రోడ్డు



గూడూరులోని ఏరియా ఆసుపత్రి వద్ద నిర్మించి ఉన్న ప్రహరీగోడ



గూడూరులోని ప్రభుత్వ స్టేడియంలో నూతనంగా నిర్మించిన గ్యాలరీ



వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖీనది వరదనీరు పొంగకుండా రూ.1.70 కోట్లుతో నిర్మించిన కాంక్రీట్‌వాల్



కోట మండలం కోట గ్రామంలో నిర్మించిన సీసీరోడ్లు

# గూడూరు నెల్లూరులోనే!

- రూ.218కోట్లతో అభివృద్ధి పనులు
- ఈ ఏడాదిలోనే సాధిస్తా!

### తొలి అడుగు వేయడానికి భయపడ్డా..!

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం కింద గడప గడపా తిరమని అధిష్ఠానం ఆదేశించినపుడు నిజంగానే భయపడ్డాను. తొలి ఏడాదిలో ఏమి చేశారు? అని ప్రజలు అడిగితే ఏమి చెప్పాలి అనే ఆందోళన మొదలయ్యింది. ఇక అప్పుడు గూడూరు నియోజకవర్గంలో ఈ ఏడాది కాలంలో చేసిన పనుల లెక్క తీశాం. అది చూశాక కొంత ధైర్యం వచ్చింది. ఇంతలో 'తల్లికి వందనం' డబ్బులు ఖాతాల్లో పడ్డాయి. తటపటాయిస్తూనే ఇల్లిల్లూ తిరిగేందుకు కదిలాను. నాలుగు గడపలు తొక్కగానే శక్తి వచ్చింది. తల్లికి వందనం పథకంలో ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలకు డబ్బులు పడ్డాయి. ఆ కుటుంబాల సంతోషం అంతా ఇంతా కాదు. నాలుగు వేల పింఛనుతో అవ్వాతాతలు ఆనందంగా పలకరించారు. ఇక ప్రజలు అడగడంతో నేనూ ప్రతి వీధిలో..ప్రతి ఊరిలో ఏదో ఒక అభివృద్ధి పని చేశాను.

**? ఎన్నికలకు ముందు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని మీరు మాట ఇచ్చారు. చంద్రబాబు కూడా ఇదే చెప్పారు. ఏడాది దాటింది కానీ ఈ హామీ అమలు కాలేదు.**

! ఇందులో అనుమానం లేదు. ఈ విషయాన్ని మరచిపోనూ లేదు. సీఎంను కలిసిన ప్రతి సందర్భంలోనూ దీని గురించే మాట్లాడుతున్నా. తప్పకుండా జరుగుతుందని సీఎం కూడా హామీ ఇచ్చారు. ఎక్కువ సమయం కూడా పట్టదు. మహా అయితే ఏడాది లోపే ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుంది. గూడూరు నెల్లూరులో కలుస్తుంది.

**? గూడూరు ఫ్లైఓవర్ పూర్తి చేయిస్తామన్నారు. ఇప్పటికీ ఇదో పెద్ద సమస్యగానే ఉంది.**

! గూడూరులో ఫ్లైఓవర్ పనిని కాంట్రాక్టర్ ఆపేశాడు. అతని చేత పని చేయించడానికి ప్రయత్నిస్తున్నాం. అది సాధ్యం కాని పక్షంలో ఆ టెండరు రద్దు చేసి కొత్త వారిచేతనైనా సరే సాధ్యమైనంత త్వరగా ఫ్లైఓవర్ పనులు మొదలయ్యేలా చూస్తా.

**? ఎమ్మెల్యే గారూ.. స్వర్ణముఖి బ్యారేజ్ ఎత్తు 2 అడుగులు పెంచుతామన్నారు. గుర్తుందా.**

! ప్రస్తుతం ఉన్న స్వర్ణముఖి బ్యారేజీ వల్ల వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు ఇటు తాగునీరు, అటు సాగునీటికి ఇబ్బందులు లేకుండా భూగర్భజలాలు పెరిగాయి. ఈ బ్యారేజి ఎత్తును రెండు అడుగులు పెంచడంతో పాటు, కరకట్లను ఆధునీకరిస్తాం. తెలుగుగంగ జలాలతో వేసవికాలంలోనూ 3 టీఎంసీల నీటిని ఇక్కడ నిల్వ చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాను. ఇది అమలు జరుగుతుంది.

**? గూడూరులో పంబలేరు వాగుపై అసంపూర్తిగా వంతెనను పూర్తి చేస్తామని మీరిచ్చిన హామీ మాటేమిటి?**

! గూడూరులో పంబలేరు వాగుపై వంతెన నిర్మించేందుకు 2018లో రూ.18 కోట్లు మంజూరు చేయించా. వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం నత్తనడకన సాగింది. అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో పూర్తయిన వంతెన నిరుపయోగంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి రాగానే ఈ వంతెనకు అప్రోచ్ రోడ్లు నిర్మించేందుకు చర్యలు మొదలయ్యాయి. ఇటీవల గూడూరు పర్యటనకు వచ్చిన ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డితో కలసి దీనిని పరిశీలించాం. అప్రోచ్ రోడ్లకు రూ.9 కోట్లు కావాలని ప్రతిపాదనలు అందజేశాం. సీఎం దృష్టికి తీసుకువెళ్లా. త్వరలోనే నిధులు మంజూరు చేయించి వంతెనను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తా.

**? గూడూరు చెరువుకట్టను ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు. దీని సంగతేమిటి.**

! చెప్పిన విధంగానే అధికారంలోకి రాగానే చెరువుకట్టపై ఉన్న ముళ్ల చెట్లను తొలగించాం. చెరువుకట్టను తుడా నిధులతో అభివృద్ధిపరిచేలా చర్యలు తీసుకున్నాం. చెరువుకట్టను ఆధునీకరించి, కట్టకు రివిట్‌మెంట్ చేయడంతో పాటు కట్టపై వాకింగ్ ట్రాక్, పార్కు, లైటింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టి సుందరీకరించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే తుడా అధికారులు పరిశీలించి, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే పనులు మొదలవుతాయి.

*"నేను పేదరికంలో పుట్టి పెరిగినవాడిని. ఇంట్లో ఒకరు జబ్బుపడితే ఆ ఇల్లు ఎంత కల్లోలం అవుతుందో నాకు తెలుసు. మధ్య తరగతి కుటుంబమైనా సరే ఇంట్లో ఒక మనిషి జబ్బుపడి మంచమెక్కితే ఆ కుటుంబం ఏళ్ల తరబడి కూడబెట్టుకున్న నగానట్రాతో సహ అన్ని కరిగిపోతాయి. పేద కుటుంబానికి ఈ పరిస్థితి వస్తే ప్రాణాల మీద ఆశలు వదులుకోవాల్సిందే. ఆ సమయంలోనే వారికి సాయం అవసరం. అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందేలా చేస్తున్నాను. ఈ సంవత్సర కాలంలో సీఎం రిలీఫ్‌ఫండ్ కింద 150 మందికి సాయం అందించాను. చెక్కులిచ్చే సమయంలో ఆ కుటుంబ సభ్యుల కళ్లలో కనిపించే సంతోషం.. ఎమ్మెల్యేగా నాకు ఎక్కువ సంతృప్తినిస్తుంటుంది."*

## కనులపండువగా కన్నయ్య వేడుక



ఉట్లోత్సవంలో ఉత్సాహంగా యువకులు

- ఇస్కాన్‌లో పోటెత్తిన భక్తులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున తులసీ పూజ చేసి మంగళహారతి సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాధాగోవిందుల దర్శనానికి భక్తులు పోటెత్తారు. అన్నారావు సర్కిల్ నుంచి హరేరామ హరేకృష్ణ మార్గం జనంతో నిండిపోయింది. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. దర్శనానంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలో భక్తుల భజనలు, జైకృష్ణ. హరేరామ, హరేకృష్ణ, గోవింద నామస్మరణలు మిన్నంటాయి. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.



సాయంత్రం వినాయకనగర్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని వినాయకనగర్ మైదానంలో సాయంత్రం ఉట్లోత్సవం ఉత్సాహంగా సాగింది. ఉట్టి కొట్టేందుకు యువత పోటీపడే సన్నివేశాలు ఆసక్తిని కలిగించాయి. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు శ్రీకృష్ణుని సేవలో పాల్గొన్నారు.

## తిరుమలలో గోకులాష్టమి

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోగర్భం డ్యాం వద్దనున్న కాళీయమర్ధనుడైన శ్రీకృష్ణస్వామికి పంచాభిషేకాలు చేశారు. స్థానిక యువతతో ఉట్లోత్సవం నిర్వహించారు. టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అలాగే రాత్రి శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉగ్రశ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, శ్రీకృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహించారు. అనంతరం ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానం చేపట్టారు. కాగా ఆదివారం సాయంత్రం శ్రీవారి ఆలయం ముందు ఉట్లోత్సవం నిర్వహించనున్నారు. మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి తిరుచ్చిలపై మాడవీధుల్లో ఊరేగనున్నారు.



కాళీయమర్థనుడైన శ్రీకృష్ణస్వామికి అభిషేకం చేస్తున్న టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

## కొండనిండా భక్తులు





శ్రీవారి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వరుస సెలవుల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండపై ఎటుచూసినా రద్దీ కనిపించింది. క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.




## మిస్ తిరుపతిగా సాత్విక

వెంకటగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఫరెవర్ స్టార్ మిస్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అందాల పోటీల్లో వెంకటగిరికి చెందిన బీటెక్ విద్యార్థిని చెన్నమనేని గమన సాత్విక విజేతగా నిలిచారు. ఈ మేరకు ఆ సంస్థ శనివారం ఆ విద్యార్థి పేరును మిస్ తిరుపతిగా ప్రకటించింది. వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ సీసీ నాయుడు కుమార్తె అయిన సాత్విక గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొనడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు.

## నాలుగు ఎర్రచందనం దుంగల స్వాధీనం : ఒకరి అరెస్టు

మంగళం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పెంచలకోన వద్ద శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఆర్‌ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం నెల్లూరు జిల్లా రాపూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. పెంచలకోన వద్ద ఈదల చెరువు సమీపంలో కొందరు వ్యక్తులు వారి కంటబడ్డారు. పట్టుకునే ప్రయత్నం చేయగా ఒకరు మాత్రమే దొరికారు. సమీపంలో నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి నెల్లూరు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. స్మగ్లర్‌తో పాటు ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు రావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం ద్వారా 942 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,861, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,919 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,798మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,488, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 479, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 373, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 109మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలను కలిపి 28,287 విక్రయించినట్లు ఆలయాధికారులు తెలిపారు.

## పెట్రోలు బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు

- వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్‌లో రెండు నాజిల్స్ సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పెట్రోలు బంకుల్లో శనివారం విజిలెన్సు అధికారులు తనిఖీలు చేపట్టారు. సీఎస్‌డీ గంగయ్య, లీగల్ మెట్రాలజీ విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విజిలెన్సు సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్ ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అక్కారంపల్లి సర్కిల్ వద్దనున్న వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్ పంపుల్లోని కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించి, రెండు నాజిల్స్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరవి చెప్పారు.



# పుత్తూరు వార్తలు

## మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



వడమాలపేటలో చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వడమాలపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):మహిళల ఆర్థిక అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు పార్లమెంట్ తెలుగుమహిళ ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న అన్నారు. స్త్రీశక్తి పథకం ప్రారంభమైన నేపథ్యంలో శనివారం బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలకు స్వీట్లు అందజేశారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించే అవకాశం ప్రభుత్వం కల్పించడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, నాయకులు హేమావతి, శ్రీధర్‌రాజు, ఉమాపతి, రాధాకృష్ణ, గురునాథం బాబు, ఆదినారాయణ, వినోద్, చందు, గుణశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచరులతో ప్రసన్న వేంకటేశ్వరుడిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊయలలో అధిష్టింపజేసి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ,కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివార్లకు మంగళహారతలిచ్చారు. ఆలయ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడి రథోత్సవం





వడమాలపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా వడమాపేటలో శ్రీకృష్ణుడి రథోత్సవం వైభవంగా జరిగింది. పట్టణంలోని కావలివీధిలో ఉన్న కృష్ణాలయంలో శనివారం ఉదయం శ్రీకృష్ణుడి విగ్రహానికి అభిషేకం నిర్వహించి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈసందర్భంగా తీర్థప్రసాద వినియోగం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం రథంలో అధిష్టింపజేసి రథోత్సవం నిర్వహించారు.

**పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతామందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అఖండ గీతా పారాయణం నిర్వహించారు. రాత్రి స్వామివారి ఊంజలసేవ నిర్వహించారు.

## పుత్తూరులో వీధి కుక్కల పట్టివేత



పుత్తూరు అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. లక్ష్మీనగర్, కృష్ణానగర్ వేదవ్యాస స్కూల్, కార్వేటినగరం రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల సంచారంపై ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రజలు ఆందోళన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు స్పందించారు. శనివారం తిరుపతికి చెందిన అనిమల్ కేర్ ల్యాండ్ సంస్థ సిబ్బంది కుక్కలను పట్టుకుని సంరక్షణ కేంద్రానికి తరలించారు.

## హరోం... హర







పుత్తూరు, వడమాలపేటల్లో కావళ్లు మోస్తున్న భక్తులు

పుత్తూరు టౌన్/ వడమాలపేట, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): ఆడి కృత్తిక పురస్కరించుకుని పుత్తూరు మండలంలో పలు మురుగన్ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా భక్తులు కావళ్లతో హరోం... హర అంటూ స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తిరుపతి రోడ్డులో ఉన్న వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, అలాగే తడుకు వద్ద గల మలేసియా మురగన్ ఆలయాలు కిటకిటలాడాయి. **వడమాలపేట** మండలంలోని కాయంపేట నుంచి ఆడికృత్తిక సందర్భంగా కావళ్లతో తిరుత్తణి సుబ్రహ్మణ్యం స్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి మొక్కులు తీర్చుకొన్నారు.

## వరసిద్ధుడి ఆలయానికి రూ.2 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి రూ.2లక్షలు విరాళంగా అందింది. అన్నదాన కార్యక్రమానికి రూ.లక్షను శ్రీకాళహస్తికి చెందిన మహేష్, గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00,116లను శ్రీకాకుళానికి చెందిన కిషోర్‌కుమార్ అందించారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.

# గూడూరు

### సూళ్లూరుపేట/వెంకటగిరి

## లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి

తడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి చెందిన ఘటన తడ మండలంలోని పన్నంగాడు వద్ద జరిగింది. తమిళనాడు రాష్ట్రంలోని విల్లుపురం ప్రాంతానికి చెందిన ఆర్ముగం(48) కొంతకాలంగా తడ మండలంలోని ఎలాఊరులో ఉంటూ అల్యూమినియం పాత్రల వ్యాపారం చేస్తున్నాడు. శనివారం పన్నంగాడుకు వచ్చి తిరిగి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా చెన్నై వెళుతున్న ఓ లారీ వేగంగా వచ్చి ఆర్ముగంను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఎలాఊరు చెక్‌పోస్టు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

తడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలు అయ్యాయి. మండల పరిధిలోని వాటంబేడుకుప్పం గ్రామానికి చెందిన బాలు అపాచీ పరిశ్రమలో పనిచేస్తుంటాడు. శనివారం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరాడు. మాంబట్టు సెజ్ రోడ్డు వద్ద మలుపు తిరుగుతుండగా నెల్లూరు వైపు వెళ్లే లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





వేనాడు దీవిలో నిర్మించిన రిసార్ట్‌లు

## వేనాడు రిసార్ట్‌ల ప్రారంభానికి గ్రహణం

**నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా నిరుపయోగంగానే ● అందుబాటులోకి వస్తే పర్యాటకులకు అనుకూలం**

తడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తడ మండల పరిధిలోని వేనాడు దీవిలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రిసార్ట్‌లు ప్రారంభానికి నోచుకోవడం లేదు. 2015లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు స్వదేశీ సదర్శన్ పథకాన్ని ప్రారంభించాయి. ఇందులో భాగంగా అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లాకు రూ.36 కోట్లు కేటాయించింది. వేనాడు దీవిలో రిసార్ట్‌ల నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేశారు. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ 2019 ఎన్నికల నాటికి సుమారు 80శాతం పనులు పూర్తి చేశారు. తరువాత ప్రభుత్వం మారిపోవడంతో నత్తనడకన పనులు సాగాయి. ఎట్టకేలకు రిసార్ట్‌ల నిర్మాణం పూర్తిచేసి పర్యాటకశాఖకు అప్పగించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం రిసార్ట్‌లను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన చేయలేదు. వేనాడు దీవిలో అందమైన మంచి నీటి దొరువులు, పక్కనే ఉన్న పులికాట్ సరస్సు, పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. అలాగే ఆసియాలోని అతిపెద్ద సమాధి అయిన షేక్ దావూద్ షావల్లి అల్లాతాత దర్గా ఉంది. ప్రతినెలా అమావాస్య నాడు వేల సంఖ్యలో భక్తులు బాబా దర్శనానికి రావడమే కాకుండా అక్కడ నిద్రిస్తుంటారు. రిసార్ట్‌లు అందుబాటులోకి వస్తే పర్యాటకులతో పాటు దర్గా సందర్శనకు వచ్చే భక్తులకూ ఎంతో అనుకూలంగా ఉంటుంది. అధికారులు చొరవ చూపి రిసార్ట్‌లను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

## ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.. అతివల్లో ఆనందం



గూడూరు పాత బస్టాండులో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న మహిళలు

గూడూరు, ఆగస్టు 16: మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించడానికి వెసులుబాటు కల్పించే స్త్రీ శక్తి పథకం ప్రారంభం కావడంతో అతివల్లో ఆనందం వ్యక్తమవుతోంది. శుక్రవారం నాడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇకనుంచి జీరో ఫేర్ టికెట్‌తో ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం ఉండడంతో మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినులకు రోజువారీ ప్రయాణ వ్యయం ఆదా అవుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే మహిళలకు ఇది మరింత ఉపయోగకరంగా మారనుంది. ప్రధానంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, వాకాడు డిపోలు ఉన్నాయి. గూడూరు డిపోలో మొత్తం 56 సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో పల్లె వెలుగులు 30, అల్ట్రా పల్లెవెలుగు 3, ఎక్స్‌ప్రెస్‌లు 16 కలిపి 49 బస్సుల్లో మహిళలు ఉచితగా ప్రయాణించవచ్చు. అలాగే వాకాడు డిపోలో మొత్తం 44 సర్వీసులు ఉన్నాయి. ఇందులో 27 పల్లెవెలుగు, 16 ఎక్స్‌ప్రెస్‌లలో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంది. మొత్తం మీద నియోజకవర్గంలోని రెండు డిపోల్లో 100 సర్వీసులు ఉండగా అందులో 92 బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందబాటులోకి వచ్చింది. మహిళలు తమ ఆధార్, రేషన్, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డులను చూపి ఉచితంగా ప్రయాణాలు సాగించవచ్చు. స్త్రీశక్తి పథకంను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంతో మహిళలు ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తున్నారు.





గూడూరు: ప్రత్యేక అలంకారంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు - వెంకటగిరి టౌన్: కృష్ణుడి వేషధారణతో చిన్నారులు

## భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

గూడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పట్టణంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రాజావీధిలోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు, చిన్నికృష్ణుడు విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ, పాండవుల వేషదారణతో రథంపై పట్టణంలో ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

**సూళ్లూరుపేట:** పట్టణంలోని బాపూజీ వీధిలో ఉన్న పాండురంగ స్వామి ఆలయం, కచ్చేరివీధిలోని కృష్ణమందిరం, షార్ బస్టాండు వద్దనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వంతంత్ర పురంలో కృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉల్లాసంగా ఉట్టిని కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్:** పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణష్టామి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల మంత్రోచ్చరణల నడుమ పూజలు జరిపారు. అనంతరం గోమాతకు పూజలు చేశారు.

**గూడూరు అర్బన్:** స్థానిక త్యాగరాజవీధిలోని శ్రీకృష్ణ గీతామందిరంలో కృష్ణాష్టమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**చిల్లకూరు:** మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి సందర్భంగా రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణుణి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కల్యాణ మహోత్సవం జరిగింది. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

**వెంకటగిరి టౌన్:** పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మష్టామి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు నృత్య ప్రదర్శన, గోపికల మధ్య కృష్ణుడి వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నిర్వహకులు నర్ర రవి, భాస్కర్, అలిమిలి మల్లిఖార్జున్, సుధాకర్, సుంకర రవి తదితరులు పాల్గొన్నారు.

**చిట్టమూరు:** మండలంలోని చిట్టమూరు, తంబుగారిపాళెం, తాడిమేడు కృష్ణ మందిరాల్లో శ్రీకృష్ణ జయంతి వేడుకలు జరిగాయి. తంబుగారిపాళెం కృష్ణ మందిరంలో వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ రుక్మిణి, సత్యభామ, శ్రీకృష్ణుడికి అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించున్నారు.

**కోట:** మండల పరిధిలోని సూరిశెట్టిపాళెం, సిద్ధవరం, కోటలోని చిన్మయ మిషన్‌లో కృష్ణష్టామి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుడి చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కోటలోని చిన్మయ మిషన్‌లో చిన్నారుల చేత శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో కోలాటాలు ఆడించారు.







చిల్లకూరులో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణం - నాయుడుపేటలో శ్రీకృష్ణుడికి పూజలు - సూళ్లూరుపేటలో ఉట్టి పూజ

## హామీలను నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుదే



మురళీరెడ్డికి కేక్ తినిపిస్తున్న కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలను సంపూర్ణంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీరెడ్డి అన్నారు. శిరసనంబేడులో శనివారం మురళీరెడ్డి జన్మదిన వేడుకలను కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మురళీరెడ్డి కేక్ కట్‌చేశారు. అనంతరం మురళీరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో భాగంగా పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల అందజేత, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి, సునీల్, కిరణ్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్ అంటే ఆలయంతో సమానం: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్లు ఆలయాలతో సమానమని ఎస్పీ హర్షవర్ధన రాజు పేర్కొన్నారు. పర్యావరణ, పరిశుభ్రతలో భాగంగా ప్రతి మూడవ శనివారం జిల్లాలోని అన్నిస్టేషన్లు శుభ్రం చేసి పర్యావరణాన్ని కాపాడుకునే క్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో నిర్వహించారు.

## బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా సుధాకర్



కోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా విద్యానగర్‌కు చెందిన షోడవరం సుధాకర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంకుమార్ ప్రకటన విడుదల చేశారు. సుధాకర్‌ను బీఎస్పీ నేతలు అభినందించారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగుంట గ్రామానికి చెందిన శ్రీకాంత్(28) గత నెల 27వ తేదీన గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి తిరుపతి రుయా ఆస్పత్రికిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ పవన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

## బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న కటాక్షం

చంద్రగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం కన్నులపండువగా ఊంజల్ సేవ జరిగింది.. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి,బంగారు తిరుచ్చి వాహనంపై ఆలయమాడ వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగ్రాయులు, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా టీడీపీ: పాశం



శేషమ్మకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తానంకి నానాజీ

చిల్లకూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎల్లవేళలా అండంగా ఉంటే పార్టీ టీడీపీయేనని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జ్యోతి వేబ్రిడ్జి కార్యాలయం వద్ద చిన్నయ్య భార్య శేషమ్మకు పార్టీ సంక్షేమనిధి నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వల్లిపేడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చిన్నయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైందన్నారు. మంత్రి లోకేశ్ కార్యకర్తల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా రన్నారు. అనంతరం బల్లవోలు గ్రామానికి యశ్వంతో పలువురు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తానంకి నానాజీ, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పెనుబోలు రామచంద్రారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుమార్‌యాదవ్, లీలావతి, కీరవాణి, సతీష్‌యాదవ్, మునిశేఖర్‌గౌడ్, త్రివిక్రమ్ భూపతి పాల్గొన్నారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

గూడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన జాబ్‌మేళా పోస్టర్లును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు 20లక్షల ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తామని నారా లోకేశ్ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలలకు ఒక్కసారి వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతోందన్నారు. ఈనెల 21వ తేదీన జరగనున్న జాబ్‌మేళాలో వివిధ కంపెనీలకు సంబంధించి 600 వరకు ఉపాధి అవకాశాలు కల్పించ నున్నారని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, లోకనాథం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతా వరణంలో జరుపుకోవాలని డీఎస్పీ చెంచుబాబు అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో గణేశ్ ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించ కుండా, ఇతరుల మనోభావాలను దెబ్బ తీసేలా వ్యవహరించకుండా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలరు. ప్రతిమల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. మున్సిపల్ అధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లోనే నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో అర్బన్ సీఐ బాబి పాల్గొన్నారు.

## గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఓజిలి, దొరవారిసత్రం: ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వినాయ కచవితిని పురస్కరించుకుని గణేష్ విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని నాయుడు పేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు అన్నారు. ఓజిలి, దొరవారిసత్రం పోలీసుస్టేషన్లలో శనివారం ఆయన గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవ కమిటీ తీసుకోవాల్సి అనుమతులు, జాగ్రత్తలు, బాధ్యతలను వారికి వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్ఐలు శ్రీకాంత్, ఎస్ఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**సూళ్లూరుపేట:** వినాయ కచవితి వేడుకలకు గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. శనివారం ఆయన పోలీసుస్టేషన్‌లో చవితి ఉత్సవాల నిర్మాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు జరుపుకునేందుకు కమిటీ వారే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏ ప్రాంతంలో విగ్రహాలు ఏర్పాటు చేస్తారో ముందస్తుగా తెలియజేసి అనుమతి తీసుకోవాలని, నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజే, రికార్డింగ్ డాన్స్‌లు నిషేధమని, అందరూ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థ కార్యవర్గం ఎంపిక

గూడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ భవనంలో శనివారం మానవ స్వచ్ఛంద సేవాసంస్థ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బాలకృష్ణంరాజు, కార్యదర్శిగా రమణారెడ్డితో పాటు సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ రామచంద్రారెడ్డి, దశరథరామిరెడ్డి, జనార్దనరెడ్డి, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, కొండూరు కోదండరామయ్య, రాంప్రసాద్, మెహబూబ్‌బాషా, కిరణ్ చక్రవర్తి, సిద్ధారెడ్డి, వాసు, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

సూళ్లూరుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డిపోలో పనిచేసే కండక్టర్ పద్మ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలంటూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈ నెల 24న టికెట్ విషయంలో రూ.30 తేడా వచ్చిందని మహిళా కండక్టర్‌ను ఇన్‌చార్జి డిపో మేనేజర్ మునిచంద్ర సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. సస్పెన్షన్‌ను రద్దు చేసి కండక్టర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు

### అధికారులకు ఎమ్మెల్యే ఆదిమూలం హెచ్చరిక



సత్యవేడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇతర వ్యక్తులకు ప్రోటోకాల్ పాటిస్తే ప్రివిలేజ్ కమిటీకి, అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా తాను ఉండగా ఇతర వ్యక్తుల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరుపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. సత్యవేడు మండలంలో మంజూరైన దాసుకుప్పం బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చి పంపాలని కోరుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతోందని అసహనం వ్యక్తం చేశారు. పలు మండలాల్లో వంతెనలు, కాజ్‌వేల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో భూమిపూజ చేసి ఆపేసిన నాగలాపురం - టీపీకోట రోడ్డు నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లానన్నారు. జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం అధికారులపై విరుచుకుపడిన తీరు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నారాయణవనం జడ్పీటీసీ సభ్యుడు, జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్ తన మండలంలోని రోడ్లు, వంతెనల సమస్యలు పరిష్కరించాలని జడ్పీ చైర్మన్, సీఈవోకు వినతి పత్రం సమర్పించారు.

## ప్రభుత్వాస్పత్రిలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు



ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తున్న బొజ్జల బృందమ్మ తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ ఆస్పత్రి కమిటీ సభ్యులతో కలిసి ఫిర్యాదుల పెట్టెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు, వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆస్పత్రి సిబ్బంది వల్ల కానీ, వైద్య సౌకర్యాలు అందించడంలో నిర్లక్ష్యం సహా ఎలాంటి సమస్యలు ఉన్నా రాసి ఫిర్యాదు పెట్టెలో వేస్తే ఆస్పత్రి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సుధీర్ పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. ప్రతి వారం ఫిర్యాదులు పరిశీలిస్తామని చెప్పారు. దీంతో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గరికపాటి రమేష్ బాబు, వినయ్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## కుక్కకాటుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరుగులు



మంచినీళ్ల గుంట వద్ద వీధిలో కుక్కలు

రేణిగుంట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు కుక్కకాటుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. నెలలో 100 కేసుల నమోదు అవుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశం, గ్రామసభల్లో కుక్కలు బెడదపై ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా వీధుల్లో గుంపులుగుంపులుగా సంచరిస్తున్నాయి. గత ఏడాది బుగ్గ వీధిలో పిచ్చికుక్క కరవడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని కరకంబాడి, జీపాళ్యం, గాజుల మండ్యం గ్రామాల నుంచి కూడా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. వాస్తవంగా వీధి కుక్కలను పంచాయతీ అధికారులు బంధించి శస్త్రచికిత్సలతోపాటూ రేబిస్ వ్యాక్సిన్లు వేయాల్సి ఉంది. అయితే మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు మాట్లాడుతూ... జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లి పంచాయతీల్లో కుక్కలను పట్టించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## స్త్రీశక్తి పథకం ప్రారంభం



రేణిగుంట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలలోని దిగువమల్లవరం బస్టాప్ వద్ద స్త్రీశక్తి పథకంలో భాగంగా పల్లెవెలుగు బస్సును కూటమి నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్ కండక్టర్, డ్రైవర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రెడ్డి, శంకర్‌రెడ్డి, క్రాంతికుమార్, సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజేష్, రమేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## అభ్యసన సామగ్రి పంపిణీ

రేణిగుంట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తివారి పల్లి ఎస్టీ కాలనీలో సిరడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 80 మంది చిన్నారులకు అభ్యసన సామగ్రి పంపిణీ చేశారు. ఎస్‌ఐ నాగరాజు, ట్రైనీ ఎస్‌ఐ స్వాతి, సంస్థ వ్యవస్థాపకుడు హేమ శేఖర్, కోఆర్డినేటర్ తేజస్విని, టీచర్లు రేఖ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయం: ఒకరి అరెస్టు

శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లావణ్య తెలిపారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధికి చెందిన హిమకిషోర్ (30) ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో అయ్యలనాడు చెరువుకట్టపై అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

## వినాయక చవితికి బలవంతపు వసూలు చేస్తే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితికి రోడ్లపై బలవంతపు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వినాయక ప్రతిమల ఏర్పాటుపై ప్రభుత్వ నిబంధనలను పేర్కొన్నారు ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, పీఎస్సై సుధీర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## మహంకాళికి పొంగళ్లు



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరులో కొలువై ఉన్న మహంకాళి అమ్మవారికి గ్రామస్తులు శనివారం పొంగళ్లు పెట్టారు. అంతకుముందు అమ్మవారి మూల విరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహించి సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా పెద్ద ఎత్తున పొంగళ్లను సమర్పించారు.



## ఆర్ఐఎంసీలో 8వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాల (ఆర్ఐఎంసీ) 2026 విద్యా సంవత్సరానికి గాను 8వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్. విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు 7న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష జరుగనుందన్నారు. 2013 జూలై 2వ తేదీ నుంచి 2015 జనవరి 1వ తేదీ మధ్య జన్మించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తులు తదితర వివరాలకు నెం. 9399976999, 8688888802 లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## రేపటి నుంచి ఆగమ జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీ నుంచి సంస్కృత యూనివర్సిటీలో ఆగమాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. వైఖానస పాంచారాత్ర శైవ తంత్రసార ఆగమాలపై చతురాగమ సదస్సు చేపట్టనున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది ప్రతినిధులు పాల్గొంటారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహిస్తారు. సదస్సు కన్వీనర్‌గా వర్సిటీ ఆగమ విభాగ ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు వ్యవహరిస్తారు. ప్రారంభ సభకు అతిథిగా మైలాపూర్ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ అరుణసుందరం పాల్గొంటారు. ప్రధాన వక్తగా టీటీడీ ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని హాజరు కానున్నారు.

# వేడుకగా గోకులాష్టమి









ముక్కంటి ఆలయంలో, బీఎన్‌కండ్రిగలో శ్రీకృష్ణుడికి పూజలు - రాజులపాళెంలో విశేష అలంకరణలో రాధాకృష్ణులు - వరదయ్యపాళెంలో కోలాటాల మధ్య కృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శనివారం గోకులాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆలయ భిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులంలో, దక్షిణ గోపురం వద్ద ఉన్న సప్తగోకులం, భరద్వాజ తీర్థంలో ఉన్న గోశాలలో గోవులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవులను విశేషంగా అలంకరించి నైవేద్యం సమర్పించారు. గోశాలలోని శ్రీకృష్ణ భగవానుడికి విశేష అలంకారాలు, పూజలు జరిగాయి. డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ... గోమాతలను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించిన ఫలం దక్కుతుందన్నారు. గోమాత ఎక్కడ సంతోషంగా ఉంటే ఆ ప్రాంతం సుఖసంతోషాలతో ఉంటుందన్నారు.

● శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి సందర్భంగా టీడీపీ బీసీ విభాగం నాయకులు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భగవద్గీతలో రాజనీతి, స్నేహధర్మం, స్వజన రక్షణ, శాంతి బోధించి శ్రీకృష్ణ పరమాత్మ జగద్గురువుగా పేరు గాంచారన్నారు. బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు మునిరాజాయాదవ్, నారాయణయాదవ్, రామకృష్ణయాదవ్, దొరైరాజ్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలో కొలువై ఉన్న శ్రీకృష్ణ మందిరంలో పుష్పయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలు ఏపీఎన్‌జీవో శ్రీకాళహస్తి తాలుకా అధ్యక్షుడు చల్లా చెంచురత్నంయాదవ్, శ్యామల దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు.

**కేవీబీపురం (ఆంధ్రజ్యోతి):** కృష్ణాష్టమి సందర్భంగా మండలంలో పలువురు తల్లులు తమ చిన్నారులను కృష్ణుడిలా అలంకరించారు. అదే విధంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు.

**బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

**ఏర్పేడు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బాలకృష్ణాపురం ఎర్రతిప్ప సమీపంలో కొలువై ఉన్న బాలకృష్ణునిడి ఆలయంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు ఊటి చంద్రశేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో పూజలు అన్నదానం జరిగాయి. చింతల పాళెంలో త్రైత సిద్ధాంత భగవద్గీత సేవా సమితి ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా మాధవమాల పంచాయతీ గుండ్రాళ్ల మిట్టలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు కల్యాణోత్సవం నిర్వహించారు. ఇక రాజులపాళెం శ్రీరామకృష్ణ ఆశ్రమంలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు.

**రేణిగుంట (ఆంధ్రజ్యోతి):** మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన జన్మాష్టమి వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అంబికాపురంలో శ్రీకృష్ణాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు రామానాయుడు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుని ప్రతిమకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం కృష్ణుని ప్రతిమను భజన, కోలాటాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. గోవర్ధనపురంలోని శ్రీకృష్ణాశ్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆశ్రమంలో గోపూజ నిర్వహించి, భజన కోలాటాలతో స్వామి వారి ఊరేగింపు చేపట్టారు.



శ్రీకృష్ణ ఆలయంలో టీడీపీ బీసీ నాయకులు

# ఘనంగా ఆడికృత్తిక వేడుకలు

**కేవీబీపురం (ఆంధ్రజ్యోతి):** ఆడికృత్తికను పురస్కరించుకుని శనివారం ప్రజలు తమిళనాడులోని తిరుత్తణి, నాగలాపురంలో ఉన్న కుమారస్వామి ఆలయాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో శనివారం ఫ్రీబస్సు ఉన్నా ఆటోలకు డిమాండ్ పెరిగింది.







గుడిమల్లం ఆలయం నుంచి పురవిహారానికి దేవేరులతో బయలు దేరిన సుబ్రహ్మణ్యస్వామి - శ్రీకాళహస్తి, గాజులమండ్యంలో ప్రత్యేక అలంకారంలో సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరువీధిలో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని బాలాజీకాలనీలో కొలువై ఉన్న కుమారస్వామికి కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు సత్రవాడ ప్రవీణ్ భక్తులకు అన్నదానం చేశారు.

**పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని రామగిరిలో ఆడికృత్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్కంద పుష్కరిణిలో అభ్యంగన స్నానాలు చేసి తలనీలాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. తెప్పోత్సవం అనంతరం హరికథ కాలక్షేపంతో పాటు మార్కండేయ నాటక ప్రదర్శన జరిగింది. రాత్రి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని గ్రామంలో ఊరేగించారు. స్వామివారిలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆరుపడై క్షేత్రాల్లో ఒక్కటైన తిరుత్తణి ఆలయం తరువాత ఈ ప్రాంతంలోని రామగిరి ఆలయం గొప్ప ప్రాచుర్యం పొందిందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఏర్పేడు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామి ఆలయంలో ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవేరుల సహా సుబ్రహ్మణ్యస్వామి పురవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ గిరినాయుడు, రాస్ డైరెక్టర్ వెంకటరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**రేణిగుంట (ఆంధ్రజ్యోతి):** ఆడికృత్తికను పురస్కరించుకొని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శనివారం గాజులమండ్యంలోని బాల సుబ్రహ్మణ్యస్వామి ఆలయం మూల విరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అలాగే పట్టణంలోని కురుమరియమ్మ ఆలయంలోని సుబ్రహ్మణ్య స్వామి ఉప ఆలయంలో ఆడికృత్తిక పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు.

**సత్యవేడు (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శనివారం ఆడికృత్తిక వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భగా ఉదయం స్వామి వారికి వివిధ పుష్పాలు, ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు.





రామగిరిలో ఎమ్మెల్యే ఆదిమూలం - శ్రీకాళహస్తిలో అన్నదానం చేస్తున్న సత్రవాడ ప్రవీణ్

## శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కుమారదేవంకు చెందిన కాసాని శ్రీహరిగౌడ్ దంపతులు శనివారం రూ.1,00,116ను విరాళంగా ఇచ్చారు. ఆలయ అధికారులు చెక్కును స్వీకరించి దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సీపీఐ రాష్ట్ర సభల పోస్టర్ల ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర సభల పోస్టర్లను మండలంలోని కనమనంబేడులో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబాకం చిన్నరాజ్, పార్టీ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సభలకు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరై పేదల సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. నాయకులు రమణయ్య, షణ్ముగం, వీరస్వామి, గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చాటూరు డీసీసీబీ చీఫ్ మేనేజర్‌కు అవార్డు

పిచ్చాటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీసీసీబీ చీఫ్ మేనేజర్ శరవణ జిల్లా ఉత్తమ మేనేజర్ అవార్డును అందుకున్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు చేతుల మీదుగా శరవణ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శరవణ మాట్లాడుతూ... ఈ అవార్డు తనతో పనిచేసే బ్యాంకు అధికారులు, సిబ్బంది, రైతులకు అంకితం అన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఉన్నత విలువలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల విద్యార్థులు ఉన్నత విలువలు పెంపొందుతాయని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో శనివారం ఇటీవల తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణులైన స్కౌట్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సేవా నిరతి, దేశభక్తి వంటి ఉత్తమ లక్షణాలు అలవరచుకునేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం చేస్తుందన్నారు. స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్, ఎస్కే రఫి, మునిరాజా, ప్రసాద్ పాల్గొన్నారు.